క్లుప్తంగా

విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న గ్రామస్తులు

టేక్మాల్(మెదక్): ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. టేక్మాల్ మండలం బర్దిపూర్ గ్రామానికి చెందిన దిగాల నరేశ్ 10జీపీఏ, ముదియాడ భానుప్రియ 9.7జీపీఏ సాధించారు. దీంతో వారిని బర్దిపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద మెదక్ జిల్లా యువజన సంఘాల ఆధ్వర్యంలో శాలువా, పూలమాలతో సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో అడ్వకేట్ వెంకట్రామి రెడ్డి, యువజన సంఘాల ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్, కిషన్, సత్యం, సాయిబాబు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రూ.1.21 లక్షల సీజ్



ఫరీద్‌కు రిసిప్ట్ అందజేస్తున్న ఎస్ఐ మురళి

టేక్మాల్(మెదక్): మండల పరిధిలోని పల్వంచ శివారులో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ.1,21,700 సీజ్‌చేసినట్లు ఎస్ఐ మురళి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ బీజేపీ కార్యాలయం నుంచి సంగారెడ్డి వైపు వెళుతున్న వాహనాలను తనిఖీచేయగా సంగారెడ్డికి చెందిన అడ్వకేట్ విష్ణువర్ధన్‌రెడ్డి వద్ద నుంచి రూ.71,500, ఆయన డ్రైవర్ ఫరీద్ వద్ద నుంచి రూ.50,200 పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నిబంధనలకు విరుద్ధంగా డబ్బును తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

నర్సాపూర్: ఎస్సీ ఉప కులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఎస్సీ 57 ఉపకులాల హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు శాఖమూరి యాదగిరి డిమాండ్ చేశారు. ఆయన సోమవారం మాట్లాడుతూ తహసీల్దార్లు ఉపకులాలకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని, కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఉపకులాలకు కార్పొరేషన్ ఏర్పాటుచేసి చైర్మన్‌గా బైరి వెంకటేశంను నియమించాలని కోరారు. ఆయన వెంట జగన్, వెంకటేశం, గోపి, రమేశ్ తదితరులు ఉన్నారు.

బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా నాని



నియామక పత్రం అందజేస్తున్న రమేశ్‌గౌడ్

కొల్చారం(నర్సాపూర్): బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా పోతంశెట్టిపల్లి గ్రామానికి చెందిన గుండు నాని, కార్యదర్శిగా ఎనగండ్ల గ్రామానికి చెందిన హర్షవర్ధన్ రెడ్డి నియామకమైనట్లు పార్టీ మండల అధ్యక్షుడు దయాకర రావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వారికి రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు రమేశ్‌గౌడ్ నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామాల బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్రం బాధ్యులు పాల్గొన్నట్లు తెలిపారు.

18న ఏడుపాయల్లో దుబ్బుల మహా కొలుపు



మాట్లాడుతున్న సంఘం సభ్యులు

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల్లో దుబ్బుల మహా కొలుపు పూజా కార్యక్రమం ఉంటుందని సీఐటీయూ మండల నాయకులు అశోక్, దుబ్బులు కొలుపు సంఘం నాయకులు తెలిపారు. సోమవారం ఏడుపాయల్లో వారు మాట్లాడుతూ ఈ మహా కొలుపు పూజా కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రక్తదాన శిబిరం

శివ్వంపేట(నర్సాపూర్): పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి జన్మదినం సందర్భంగా సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కొంతన్‌పల్లిలో నిర్వహించిన ఈ శిబిరాన్ని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో సుహాసినిరెడ్డి, మాధవరెడ్డి, సదర్శన్‌గౌడ్, నవీన్‌గుప్తా, వేణుగోపాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, గంగాధర్, శ్రీనివాస్‌గౌడ్, రాజు, నర్సింహులుగౌడ్ పాల్గొన్నారు.

దారితప్పిన దత్తత

ప్రతి విద్యార్థిని దత్తత తీసుకుని వారిపై ప్రత్యేక శ్రద్ధచూపి ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్యను అందించాలనే ప్రభుత్వ లక్ష్యం మాటల వరకే పరిమితమవుతోంది. గత ప్రభుత్వ హయాంలో మన ఊరు-మన బడి పేరుతో ఉపాధ్యాయులు ప్రతి ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి పాటుపడ్డారు. కాని విద్యార్థులు చదువులో పురోగతి సాధించడంలో మాత్రం వెనకబడ్డారు. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాలే దానికి నిదర్శనం.



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈఓ(ఫైల్)

పది ఫలితాల్లో వెనుకబాటు

- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఉపాధ్యాయులు
- యూనియన్‌ల పేరుతో వర్గాలు
- లోపించిన అధికారుల పర్యవేక్షణ

మనోహరాబాద్(తూప్రాన్): హైదరాబాద్‌కు కూతవేటు దూరంలో మనోహరాబాద్ మండలం ఉండడంతో ఉపాధ్యాయులు పైరవీలతో చుట్టుపక్కల గ్రామాలకు పోస్టింగ్ వేయించుకున్నారు. దాదాపు వాళ్లంతా యూనియన్‌లలో పెద్దపెద్ద పోస్టులు కలిగి ఉన్నవారే. ఉపాధ్యాయులు యూనియన్ల పేరుతో బయట తిరగడం, పాఠశాలకు వచ్చినా ఎక్కువగా ఫోన్‌లకే పరిమితమవుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. విద్యా బుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయులే యూనియన్ల పేరుతో గ్రూప్‌లుగా విడిపోయి చిన్నారులకు విద్యను బోధించడంలో అలసత్వం వహిస్తున్నారు. దాని ఫలితంగా విద్యార్థులు పదో తరగతిలో అనుకున్నంత స్థాయిలో విజయం సాధించలేక పోయారు. ఉపాధ్యాయుల బోధనా రీతి, విద్యార్థుల చదవుపై పర్యవేక్షణ చేయాల్సిన విద్యాశాఖ కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పైస్థాయి అధికారులు, ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి నిరుపేదలకు విద్యనందించేలా కృషి చేయాలని వారు కోరుతున్నారు.

- ప్రైవేట్ పాఠశాల్లో విద్యార్థులు ఉత్తీర్ణులు కావడానికి ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించడంతోనే 100శాతం ఫలితం సాధిస్తున్నారు.
- ప్రభుత్వ పాఠశాలలో మాత్రం ఉపాధ్యాయులు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తుండడంతో కనీసం 50శాతం ఫలితం కూడా రాలేదు.
- కూచారం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు వర్గాలుగా విడిపోవడంతో 19మందిలో 15మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు.
- పర్కిబండలో 16మంది విద్యార్థులకు కేవలం ఐదుగురు విద్యార్థులు, రామాయపల్లిలో 24 మందికి ఏడుగురు మాత్రమే ఉత్తీర్ణత సాధించారు.
- ముప్పిరెడ్డిపల్లి, రంగాయపల్లి, మనోహరాబాద్, కాళ్లకల్ ఉన్నత పాఠశాలలో సైతం ఫలితాలు ఆశించిన స్థాయిలో రాలేదు.

గెజిటెడ్ హెచ్‌ఎంలు ఉన్నా.. ఫలితాల్లో వెనుకంజ



చిన్నశంకరంపేట జెడ్పీపాఠశాల

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాలలోని జెడ్పీపాఠశాల్లో పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం తగ్గడం చర్చనీయంశంగా మారింది. గతంలో ఇన్‌చార్జి హెచ్‌ఎంలు ఉన్నప్పటికీ మెరుగైన ఫలితాలు పొందిన పాఠశాలలు ఈ సారి గెజిటెడ్ హెచ్‌ఎంల పర్యవేక్షణలో తరగతులు జరిగినప్పటికీ వెనుకంజలో ఉన్నాయి. చిన్నశంకరంపేట జెడ్పీ పాఠశాలలో 53శాతం ఉత్తీర్ణత సాధించడంపై విమర్శలు నెలకొన్నాయి. అలాగే ధర్పల్లి జెడ్పీపాఠశాలలో 53 శాతం, శాలిపేట జెడ్పీపాఠశాలలో 58శాతం, చందంపేట జెడ్పీ పాఠశాలలో 62.5 శాతం, సూరారంలో 62.8 శాతం, మిర్జాపల్లిలో 80.77 శాతం, మడూర్‌లో 83 శాతం ఉత్తీర్ణత సాధించారు. చిన్నశంకరంపేట కస్తూర్బా పాఠశాలలో 65 శాతం సాధించగా, ఒక్క మోడల్‌స్కూల్‌లో మాత్రమే 99శాతం సాధించడంతోపాటు 10 జీపీఏ, 9.8 గ్రేడ్‌లో ముగ్గురు విద్యార్థులు ఫలితాలు సాధించారు. ఉన్నతాధికారులు సమీక్షించి ఉత్తమ ఫలితాలు పొందేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

కనిపించని విద్యార్థుల దత్తత



విద్యార్థులు పరీక్షల్లో సాధించే మార్కులను బట్టి ఉపాధ్యాయులు వారిని దత్తత తీసుకుని ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి. కానీ ఇది ఏ పాఠశాలలోను కనిపించలేదు. ఉపాధ్యాయులు, అధికారులు దృష్టిసారించి పేద విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయాలి.

– మద్దూరి శ్రీశైలంగౌడ్, కాళ్లకల్

ప్రత్యేక శ్రద్ధ వహించాలి..



ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రణాళిక బద్ధంగా వారి చదువుకు కృషిచేయాలి. నిరంతరం వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించినప్పుడే ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతాయి.

– వెంకట్‌రెడ్డి, యువకుడు, మనోహరాబాద్

బసవేశ్వరుడు అందరివాడు



శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు

బాల్కి పీఠాధిపతి బసవలింగ పట్టదేవరు

రేగోడ్(మెదక్): మహాత్మా బసవేశ్వరుడు అందరివాడు అని బాల్కి పీఠాధిపతి బసవలింగ పట్టదేవరు మహరాజ్, బిచ్కుంద పీఠాధిపతి సోమాయప్ప మహరాజ్ ప్రశంసించారు. రేగోడ్‌లో సోమవారం బసవేశ్వరుడి విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ బసవేశ్వరుడి అడుగుజాడల్లో నడుచుకోవాలన్నారు. బసవేశ్వరుడి చిత్రపటంతో ఘనంగా శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో వీరశైవలింగాయత్ రాష్ట్ర అధ్యక్షుడు పట్లోళ్ల సంగమేశ్వర్, నాయకుడు గుండప్ప, మహిళలు పాల్గొన్నారు.

ప్రత్యేక బలగాల ఫ్లాగ్‌మార్చ్

తూప్రాన్: రానున్న లోకసభ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక బలగాలతో పట్టణ కేంద్రంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. సోమవారం సీఐ కృష్ణ మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావారణంలో ఎన్నికలు జరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. చట్టవ్యతిరేక కార్యకాలపాలకు పాల్పడినవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్ఐలు శివానందం, యాదగిరి, తమిళనాడుకు చెందిన ఆర్మీ రిజర్వ్ పోలీసులు పాల్గొన్నారు.



ఫ్లాగ్‌మార్చ్ చేస్తున్న పోలీసులు

బీజేపీలో చేరికలు

నిజాంపేట(మెదక్)/పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రానికి చెందిన యువజన సంఘాల నాయకులు బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు, జెడ్పీటీసీ పంజా విజయ్ కుమార్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా సోమవారం వారు మాట్లాడుతూ రానున్న లోక్‌సభ ఎన్నికల్లో రఘునందన్ రావును భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. కార్యక్రమంలో పప్పుల సిద్దరామ్‌రెడ్డి, ఆముద రాజు, నాగులు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసే..

పెద్దశంకరంపేట(మెదక్)/పాపన్నపేట(మెదక్)/రామాయంపేట(మెదక్): అభివృద్ధిని చూసే బీజేపీలో చేరికలు కొనసాగుతున్నాయని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కోణం విఠల్ అన్నారు. పెద్దశంకరంపేటకు చెందిన పలువురు యువకులతో పాటు రామోజిపల్లికి చెందిన సీనియర్ బీఆర్ఎస్ నాయకులు ఉప్పరిసాయిలు తదితరులు బీజేపీలో చేరారు. శ్రావణ్, అశోక్, సుభాష్, సుధాకర్, శ్రీహరి తదితరులున్నారు. అలాగే పాపన్నపేట మండలానికి చెందిన పలువురు రఘునందన్‌రావు సమక్షంలో మాజీ సర్పంచ్ ఇమాన్యుయేల్, నామాపూర్ మాజీ సర్పంచ్ అంజయ్య, పొడిచన్‌పల్లి మాజీ సర్పంచ్ జ్యోతి సంజీవరావు బీజేపీలో చేరారు. అదేవిధంగా రామాయంపేట, నిజాంపేట మండలాలకు చెందిన ఇతర పార్టీల కార్యకర్తలు జెడ్పీటీసీ పంజా విజయకుమార్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. కార్యక్రమంలో సుధాకర్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, విజయ్, ఉదయ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ప్రియాంక గాంధీ పర్యటన వాయిదా

నర్సాపూర్ రూరల్: లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం మంగళవారం నర్సాపూర్‌కు రావాల్సిన కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ పర్యటన వాయిదా పడినట్లు ఆ పార్టీ నేతలు సోమవారం తెలిపారు. ప్రియాంక గాంధీకి బదులుగా 9వ తేదీన రాహుల్ గాంధీ రానున్నట్లు పేర్కొన్నారు.

◆ చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నర్సాపూర్ రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ గాంధీ ఆస్పత్రిలో మృతి చెందినట్లు నర్సాపూర్ ఎస్ఐ పుష్పరాజ్ తెలిపారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండల కేంద్రానికి చెందిన డేవెళ్ల రాకేశ్(28) సోమవారం ఉదయం బైక్‌పై మెదక్ నుంచి నర్సాపూర్ వస్తుండగా పెద్ద చింతకుంట సమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. స్థానికులు ఆయనను నర్సాపూర్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

◆ పేలిన నాటు బాంబులు
వ్యక్తికి గాయాలు, స్కూటీ దగ్ధం

శివ్వంపేట(నర్సాపూర్): నాటు బాంబులు పేలి ఓ వ్యక్తికి స్వల్ప గాయాలు కావడంతోపాటు స్కూటర్ దగ్ధమైన ఘటన మండల పరిధి టిక్యాదేవమ్మ గూడెం పంచాయతీ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. తండాకు చెందిన ఓ వ్యక్తి అడవి పందులను వేటాడుతాడు. సోమవారం స్కూటర్ డిక్కిలో ఉంచిన నాటు బాంబులు పెద్ద శబ్దంతో పేలి ఓ వ్యక్తి స్వల్ప గాయాలు అయ్యాయి. స్కూటర్ సైతం దగ్ధమైంది.

◆ రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పెద్దశంకరంపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన పెద్దశంకరంపేటలో చోటు చేసుకుంది. టేక్మాల్ మండలం బోడగట్టుకు చెందిన సాయిలు, లక్ష్మి తమ పిల్లలతో టీవీఎస్ వాహనంపై నిజాంపేట నుంచి పెద్దశంకరంపేట వైపు వస్తుండగా ఆర్టీసీ బస్సు వెనుకభాగం తగిలింది. దీంతో వారు కిందపడి గాయపడడంతో స్థానికులు సంగారెడ్డిలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

◆ దొంగల హల్‌చల్

తూప్రాన్: పట్టణ కేంద్రంలో అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని కింది బస్తీలో నివాసం ఉంటున్న జహంగీర్ ఆదివారం కామారెడ్డి జిల్లాలోని పెద్ద గుట్ట దర్గాకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. ఇంటికి తాళం వేసి ఉండడాన్ని గమనించిన ముగ్గురు దొంగలు సోమవారం తెల్లవారుజామున ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. రాత్రి వేళ గస్తీ తిరుగుతున్న పోలీసులు గమనించి వారిని పట్టుకునే ప్రయత్నం చేయగా దొంగలు పారిపోయారు. ఉదయం పోలీసులు క్లూస్ టీమ్‌ను రప్పించి దొంగల వేలిముద్రలు సేకరించారు. దొంగలు ఏమేమీ చోరీ చేశారో తెలియరాలేదు. ఎస్ఐ శివానందంను వివరణ కోరగా దొంగతనం జరిగిన విషయం వాస్తవమే అన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామన్నారు.

కాంగ్రెస్‌దే మెదక్ ఎంపీ స్థానం

మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి

తూప్రాన్/మనోహరాబాద్(తూప్రాన్): మెదక్ ఎంపీ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన సమక్షంలో జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ గడప దేవేందర్ ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో మత్స్యకారులు కాంగ్రెస్‌లో చేరారు. రాష్ట్ర మాజీ ఫుడ్స్ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతికృష్ణ, వైస్ చైర్మన్ శ్రీనివాస్, రవీందర్‌గుప్త, రఘుపతి, నాగరాజుగౌడ్, అనిల్, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మనోహరాబాద్ మండలంలో బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ నాయకులు, పలు గ్రామాల మాజీ వార్డు సభ్యులు మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండల మైనార్టీ అధ్యక్షుడు ఇర్ఫాన్, ముస్తాఫా, సయ్యద్, గులాం, హన్మంత్‌గౌడ్ తదితరులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఇతర పార్టీల నాయకులు..

నిజాంపేట(మెదక్)/చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని ఇతర పార్టీలకు చెందిన పలువురు నాయకులు స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ టరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ ఉపసర్పంచ్ కొమ్ముట బాబు, బండారి ఎల్లం తదితరులు పాల్గొన్నారు. అలాగే నార్సింగి మండల బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ మిథునం యాదగిరి, బీఆర్ఎస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు రోమాల రాజు తమ అనుచరులతో కలిసి దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారి వెంట ఆకుల శ్రీనివాస్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, ఎంకే రాజు, దేవాదాస్, తొంట స్వామి ఉన్నారు.



మనోహరాబాద్(తూప్రాన్): మైనార్టీ నాయకులను ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి

ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చేరిక

నర్సాపూర్: ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అక్షయ్‌గౌడ్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నీలం మధు ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీపై ఉన్న నమ్మకంతోనే ఇతర పార్టీలకు చెందిన నాయకులు చేరుతున్నారన్నారు.

● ఉత్సాహంగా రోడ్‌షో



ప్రచార రథంపై ఎమ్మెల్యే రోహిత్, నీలం మధు

బైక్ ర్యాలీ నిర్వహించిన కార్యకర్తలు

రామాయంపేట(మెదక్): కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన బైక్ ర్యాలీ, రోడ్డుషో విజయవంతమైంది. వందలాది మంది కార్యకర్తలు పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించగా, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, ఎంపీ అభ్యర్థి నీలం మధు ప్రచార రథంలో వారిని అనుసరించారు. పెద్దమ్మ ఆలయం వద్దనుంచి ప్రారంభమైన ర్యాలీ, వివేకానంద విగ్రహం, సిద్దిపేట రోడ్డు, ఇందిరాగాంధీ విగ్రహం, మార్కెట్ మీదుగా కొనసాగింది. రాష్ట్ర నాయకుడు సుప్రభాతరావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్

ఎమ్మెల్యే సునీతారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: అసెంబ్లీ ఎన్నికలప్పుడు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆరోపించారు. సోమవారం ఆమె పట్టణంలో ప్రచారం ప్రారంభించి మాట్లాడుతూ మహిళలకు నెలకు రూ.2500 సహాయం, నిరుద్యోగులకు భృతి, రూ.500కే సిలిండరు తదితర హామీలు ఇచ్చిందని, కాని అవన్నీ అందుతున్నాయా అంటు ప్రజలను అడిగారు. కాంగ్రెస్ వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో విద్యుత్ సరఫరా సరిగా ఉండడం లేదని కష్టాలు మొదలయ్యాయని చెప్పారు. బీజేపీ మతతత్వ పార్టీఅని, ప్రజలను మతాలు, కులాలుగా విభజించి పబ్బం గడుపుకోవాలని చూస్తోందని ఆరోపించారు. బీజేపీ సైతం హామీలు అమలు చేయలేదని మండిపడ్డారు. అనేక వస్తువుల ధరలు పెంచి ప్రజలపై భారం మోపిందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్ర ప్రజలకు సామాజిక న్యాయం లభించిందని గుర్తుచేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని మంచి మెజారిటీతో గెలిపించి కాంగ్రెస్‌ను, మతతత్వ పార్టీ బీజేపీలకు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఆమె వెంట మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ నయిమోద్దీన్, భిక్షపతి, బాల్‌రెడ్డి, రాంచందర్, శ్రీనివాస్‌యాదవ్, లక్ష్మణ్‌యాదవ్, ఆంజనేయులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నశంకరంపేట(మెదక్): ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పద్మారెడ్డి

వెంకట్రామిరెడ్డిని గెలిపించాలి
– మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి ప్రచారం

చిన్నశంకరంపేట(మెదక్): బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని గెలిపించాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చిన్నశంకరంపేట మండలం ఖాజాపూర్, ఖాజాపూర్ తండా, నార్సింగి మండలంలోని సంకాపూర్ తండాలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్న చోటుకు వెళ్లి కూలీలతో మాట్లాడుతూ బీఆర్ఎస్ గెలవాల్సిన అవసరం ఉందన్నారు. ఆమె వెంట జెడ్పీటీసీలు పట్లోరి మాధవి రాజు, భానపురం కృష్ణారెడ్డి, ఎంపీపీ సబిత, వైస్ ఎంపీపీలు సుజాత, సత్యనారాయణగౌడ్, మండల అధ్యక్షుడు పట్లోరి రాజు తదితరులు ఉన్నారు.

శివ్వంపేట(నర్సాపూర్)లో..

మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ శ్రేణులు ఎన్నికల ప్రచారం నిర్వహించాయి. కారు గుర్తుపై ఓటేసి ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని గెలిపించాల్సిందిగా ఇంటింట ప్రచారం నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పనులు అడ్డుకుంటున్నారు..

- ఉపాధి కూలీల నిరసన
- ఎంపీడీఓ చిన్నారెడ్డి హామీ



నిరసన తెలుపుతున్న ఉపాధి కూలీలు

చేగుంట(తూప్రాన్): స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద పొలంపల్లి గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలో యంత్రాల సాయంతో ఉపాధి పనులు నిర్వహిస్తున్నారని కొందరు డయల్ 100కు సోమవారం ఫోన్ చేశారు. దీంతో పోలీసులు ఉపాధి పనులు జరుగుతున్న చోటుకు వెళ్లి విచారించారు. భయపడిన ట్రాక్టర్ యజమానులు తాము ఇక నుంచి ఉపాధి పనుల మట్టి తరలింపు కోసం వచ్చేది లేదని వెళ్లిపోయారు. దీంతో కూలీలు చేగుంట తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. గ్రామంలోని కొందరు ఉపాధి పనులు చేయకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. కూలీల సమస్యలను తెలుసుకున్న ఎంపీడీఓ చిన్నారెడ్డి ఉపాధి పనులు ఇబ్బంది లేకుండా చేసుకునేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రైవేటు వ్యక్తులు మట్టి తరలించాలంటే కచ్చితంగా మైనింగ్ అధికారుల అనుమతులు తీసుకోవాలని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నర్సింగ్‌యాదవ్ సూచించారు. అధికారులు హామీ ఇవ్వడంతో ఉపాధి కూలీలు నిరసన విరమించారు.

సురేశ్ షెట్కార్ గెలుపు తథ్యం

కాంగ్రెస్ నేత నిమ్మ రమేశ్



టేక్మాల్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

టేక్మాల్(మెదక్): జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సురేశ్ షెట్కార్ గెలుపు తథ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మ రమేశ్ ధీమా వ్యక్తం చేశారు. టేక్మాల్‌లో సోమవారం ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీకి ఓటు వేస్తే కులమతాల మధ్య చిచ్చు పెరిగి దేశం ముక్కలవుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే దేశాబివృద్ధి సాధ్యమని చెప్పారు. పట్టణ అధ్యక్షుడు కిషోర్, మండల కో–ఆప్షన్ సభ్యుడు మజహర్, మాజీ సర్పంచ్ పాపయ్య, సుధాకర్, మాన్‌కిషన్, విద్యాసాగర్, విటల్‌గౌడ్, శ్రీదర్‌పంతులు, శివమల్లయ్య, దండు కాంతం, పట్నం రాజు, సోలాపురం రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం..

చేగుంట(తూప్రాన్)/తూప్రాన్: చేగుంటలో నిర్వహించిన ప్రచారంలో వడ్ల నవీన్ మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, విద్యుత్‌తోపాటు ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్న కాంగ్రెస్‌ను గెలిపిస్తే మరిన్ని పతకాలు అమలవుతాయన్నారు. ఎంపీపీ మాసుల శ్రీనివాస్, శ్రీకాంత్, కుర్మ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అలాగే తూప్రాన్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతికృష్ణ, చైర్మన్ శ్రీనివాస్, రవీందర్‌గుప్త, శ్రీనివాస్‌యాదవ్, నాగరాజుగౌడ్, నాగులు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.